

హోటల్ ఫుడ్‌తో అస్వస్థత
నర్సాపూర్‌లోని ఓ హోటల్‌లో బిర్యాని తిన్న పలువురు అస్వస్థతకు గురయ్యారు. కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు అధికారులు హోటల్‌లో శాంపిల్స్ సేకరించారు. 8లో..



దీవించమ్మా.. బట్టమ్మ తల్లి
ఉగాదిని పురస్కరించుకొని కౌడిపల్లి మండలం కూకుట్లపల్లిలో నిర్వహించే బట్టమ్మ తల్లి జాతరకు అన్ని ఏర్పాట్లు చేశారు. 8లో..



పోయొస్తాం.. పోచమ్మతల్లి
మూడునెలలుగా సాగిన కొండపోచమ్మ ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరిరోజు భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 9లో..

న్యూస్‌రీల్

పంచాంగం అందజేత



సీపీ శ్వేతకు పంచాంగం అందిస్తున్న కొమురవెల్లి ఆలయ అర్చకులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ అర్చకులు ఉగాది నూతన పంచాంగాన్ని మంగళవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్.శ్వేతకు అందించారు. శాస్త్రోత్తంగా వేద ఆశీర్వచనం ఇచ్చి, స్వామివారి ప్రసాదం, పంచాంగాన్ని అందించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) మహేందర్, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, మహాదేవుని సాంబయ్య, పడిగిన్నగారి మల్లయ్య, రవి, శివప్రసాద్, సూర్యకుమార్, సిద్దేశ్వర్ ఉన్నారు.

రీడింగ్ రూమ్ ఏర్పాటు చేయాలి
అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

సిద్దిపేటరూరల్: యువత చదువుకునేందుకు మండల కేంద్రాల్లో రీడింగ్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చీఫ్ సెక్రెటరీ శాంతి కుమారి ఆదేశాల మేరకు ప్రతీ మండలంలో పాత గవర్నమెంట్ భవనాన్ని ఎంపిక చేసి ఎంపీడీఓ, ఎంపీఓ, సెక్రెటరీలు దానిని శుభ్రం చేసి సిద్ధం చేయించాలన్నారు. గదిలో బల్లలు, కుర్చీలు, విద్యుత్ ఇతర సామగ్రిని జిల్లా గ్రంథాలయ సంస్థ నుంచి సమకూర్చాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



పరీక్ష కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఐఈఓ సూర్యప్రకాశ్

దుబ్బాకటౌన్: ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సూర్యప్రకాశ్ అన్నారు. మంగళవారం దుబ్బాక ప్రభుత్వ జూనియర్, ఎస్ఆర్, వాగ్దేవి జూనియర్ కళాశాలలో తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. సీటింగ్, మంచి నీటి సదుపాయం, మూత్రశాలలు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలన్నారు. కేంద్రాలను ప్రతీ రోజు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరిశీలిస్తున్నాయన్నారు. ఆయా కేంద్రాల్లో పరీక్షల నిర్వాహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ఉప సర్పంచ్ చెక్ పవర్ రద్దు
నంగునూరు(సిద్దిపేట): మగ్దుంపూర్ గ్రామ ఉపసర్పంచ్ బండారు రాజవ్వ చెక్ పవర్ రద్దు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వేణుగోపాల్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి సిబ్బంది వేతనాలు, సీసీ చార్జీలు, ట్రాక్టర్ లోన్ బిల్లులపై సంతకం పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. విచారణ అధికారులు అందించిన నివేదిక ప్రకారం రాజవ్వ చెక్ పవర్ రద్దు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిపారు. గ్రామస్తుల తీర్మానం మేరకు ఒకటో వార్డు సభ్యురాలు లాస్యకు జాయింట్ చెక్ పవర్ అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

కేంద్రీయ విద్యాలయ ప్రవేశాలకు దరఖాస్తులు
సిద్దిపేటరూరల్: 2023–24 విద్యా సంవత్సరానికి గాను కేంద్రియ విద్యాలయంలో 1వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మంగళవారం తెలిపారు. ఈనెల 27న నుంచి ఏప్రిల్ 17వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు దరఖాస్తులను సమర్పించవచ్చని అన్నారు. 1తరగతిలో ప్రవేశానికి మార్చి 31, 2023 నాటికి 6 ఏళ్లు ఉండాలని, కేంద్రియ విద్యాలయ అడ్మిషన్ గైడ్‌లైన్స్ ప్రకారం సీట్ల రిజర్వేషన్ ఉంటుందన్నారు. 2వ తరగతి, అంతకన్న ఎక్కువ తరగతుల ఖాళీలకు ఆఫ్‌లైన్ విధానంలో ఏప్రిల్ 3 నుంచి ఏప్రిల్ 12 వరకు మాత్రమే దరఖాస్తులను సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు https://kvsonlineadmission.kvs.gov.in వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

నేత్రపర్వం.. విమాన రథోత్సవం

- నాచగిరికి పోటెత్తిన భక్తజనం
- ప్రత్యేక పూజలందుకున్న స్వామివారు
- హాజరైన ప్రజాప్రతినిధులు



స్వామివారి సన్నిధిలో వంటేరు ప్రతాప్‌రెడ్డి



నాచగిరీశుడిని దర్శించుకుంటున్న భక్తులు

వర్గల్(గజ్వేల్): భక్తుల రాకతో నాచగిరి పోటెత్తింది. నృసింహ నామ స్మరణతో హరిద్రాతీరం మారుమోగింది. రెండో యాదాద్రిగా పేరొందిన నాచారం గుట్ట శ్రీలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో మంగళవారం నిర్వహించిన శ్రీవారి రథోత్సవం నేత్రపర్వంగా కొనసాగింది. ఉదయం 6 గంటలకు విమాన రథయాత్ర మొదలైంది. ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. ఈఓ సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ బాలమల్లు యాదవ్, ఎంపీపీ లత, ఆలయ మాజీ చైర్మన్ యాదగిరి, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ యాదగిరిగౌడ్ తదితరులు ఊరేగింపులో పాల్గొన్నారు. బుధవారం నిర్వహించే శత ఘటాభిషేకంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని, అనంతరం పంచాంగ శ్రవణం ఉంటుందని ఆలయ బాధ్యులు తెలిపారు.

భక్తుల కోలాహలం..

బ్రహ్మోత్సవాల సందర్భంగా తరలివచ్చిన భక్తులతో నాచగిరి నలుదిశలా సందడి కనిపించింది. తాత్కాలిక గుడారాలు హరిద్రా తీరాన్ని కప్పేశాయి. మహిళల బోనాలు, కోలాటాలు, డప్పు వాయిద్యాల కోలాహలం నడుమ శ్రీవారు పుర వీథుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, ఉమ్మడి మెదక్ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరించి, స్వామివారికి కట్నకానుకలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గౌరారం పోలీసులు పర్యవేక్షించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి నర్సింహగౌడ్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.



విమానరథంపై లక్ష్మీనృసింహస్వామి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

సభ్యత్వం వేగవంతం చేయాలి

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్
- మత్స్యశాఖ అధికారులతో సమీక్ష

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా మత్స్య సంఘాల సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా మత్స్య శాఖ, పంచాయతీ అధికారులు, అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకార వృత్తిపై ఆధారపడిన కార్మికులు లబ్ధి పొందేందుకు సభ్యత్వం తీసుకోవాలన్నారు. జిల్లా పంచాయతీ శాఖ అధికారులు, ఎంపీఓలు, సెక్రెటరీలు మత్స్యశాఖ అధికారులకు సహకారం అందించాలని అన్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో బెస్త, గంగపుత్ర, ముదిరాజ్ కులస్తులల్లో 18 ఏళ్ల నుంచి 55ఏళ్లలోపు ఉన్న వారు సహకార సంఘంలో సభ్యులుగా చేరాలన్నారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్, కుల పెద్దలకు సమాచారం అందించి సభ్యత్వ నమోదును నిర్వహించాలన్నారు. అర్హుల జాబితా తయారీ అనంతరం మత్స్యశాఖ ఆధ్వర్యంలో కార్మికులకు చేపలు పట్టడం, వలలు విసరడం, ఈత కొట్టడం తదితర విభాగాల్లో శిక్షణ అందిస్తారని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం టెస్ట్ నిర్వహించి సభ్యత్వం అందిస్తారని తెలిపారు. మత్స్యశాఖ అధికారులు, పంచాయతీ అధికారులు ఎంపీఓలు, సెక్రటరీలు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం, జిల్లా పంచాయతీ అధికారి దేవకి దేవి, ఆయా శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సర్టిఫికెట్లు అందిస్తాం

ఇండస్ట్రియల్ పార్క్‌లో తుది దశకు చేరుకున్న ఆటో నగర్ నిర్మాణంలో దరఖాస్తు చేసుకున్న అర్హులకు మాత్రమే సర్టిఫికెట్లను అందిస్తామని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆటోనగర్ యూనియన్ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. పాత ఆటోనగర్‌లో ఉన్న షాప్ ఓనర్లు మాత్రమే అర్హులని, టీఎస్ఐఐసీ సంస్థ ఆధ్వర్యంలో పరిశ్రమలకు లీజ్ పద్ధతిలో అందజేస్తామన్నారు. ట్రేడ్ లైసెన్స్, ఫొటో కాపీతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ప్రాధాన్యత పద్ధతిలో సర్టిఫికెట్లు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మెడికల్ బోర్డు సభ్యులు పాల సాయిరాం పాల్గొన్నారు.

సృష్టికి మూలం 'రుతుచక్రం'

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



మాట్లాడుతున్న సీపీ శ్వేత, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ తదితరులు

కొండపాక(గజ్వేల్): రుతుచక్రం మానవ సృష్టికి మూలమని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సీపీ శ్వేత అన్నారు. మండలంలోని కొండపాక రైతు వేదికలో మంగళవారం అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్, డీపీఓ దేవకీదేవి, ఎంపీపీ సుగుణ, ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు చిట్టి మాధురీతో కలిసి రుతుప్రేమపై అవగాహన కల్పించారు. మహిళల ఆరోగ్యం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, శానిటరీ ప్యాడ్స్‌కు బదులు పర్యావరణ హితమైన వానిటరీ కప్పులను ఉపయోగించాలన్నారు. వాడిన శానిటరీ ప్యాడ్స్‌ను చెత్త బండిలో వేయొద్దని సూచించారు. అనంరతం రుతుప్రేమ ఉద్దేశ్యాన్ని పాటిస్తామంటూ మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పర్యావరణ శాఖ జిల్లా అధికారి శాంతి, సీడీపీఓ శారద పాల్గొన్నారు.

పామాయిల్‌తో అధిక లాభాలు

గజ్వేల్‌రూరల్: పామాయిల్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యసాయాధికారి శివ ప్రసాద్ పేర్కొన్నారు. ప్రజ్ఞాపూర్‌లో రైతులు సాగు చేసిన పామాయిల్ తోటలను మంగళవారం వ్యవసాధికారులతో కలిసి పరిశీలించారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తోందని, 3 ఏళ్ల పాటు పంటను కాపాడితే 30ఏళ్ల వరకు ఆదాయం లభిస్తుందని అన్నారు. దళారులు లేకుండా ప్రభుత్వమే ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేస్తుందన్నారు. మండల వ్యవసాయాధికారి నాగరాజు, ఏఈఓ గణేష్‌కుమార్ తదితరులున్నారు.

డ్రోన్‌తో సాగు సులభతరం

దుబ్బాక: డ్రోన్ల వినియోగంతో సాగు సులభతరం అవుతుందని జిల్లా వ్యవసాయ అధికారి శివ ప్రసాద్ అన్నారు. మంగళవారం రాయపోల్ మండలం ఆరెపల్లి రైతు వేదికలో ఫ్యాక్ట్ కంపెనీ ప్రతినిధులతో కలిసి డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. మండల వ్యవసాయ అధికారి నాగరాజ్, ఫ్యాక్ట్ కంపెనీ నిర్వాహకులు రామ్ మోహన్ రావు, తదితరులున్నారు.



డ్రోన్ వినియోగంపై వివరిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

మల్లన్నకు కాసుల గలగల

- బుకింగ్‌తో రూ.4.30కోట్లు,
- హుండీ ద్వారా రూ.3.16కోట్ల ఆదాయం



రాజగోపురం వద్ద భక్తుల సందడి (ఫైల్)

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జునుడి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ హుండీకి భారీగా ఆదాయం వచ్చింది. 9వారాల్లో బుకింగ్, హుండీ ద్వారా కాసుల వర్షం కురుస్తుంది. సుమారు 10 లక్షల మంది స్వామి వారిని దర్శించుకున్నారు. బుకింగ్ ఆదాయం రూ.4,30,91,414 , హుండీ ఆదాయం 3.16కోట్లు వచ్చాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 9 వారాల్లో స్వామివారికి అర్జిత సేవలు పట్నం, బోనాలు, అభిషేకం ప్రసాద విక్రయ, కేశఖండన, వసతి గదుల అద్దె మొదలగు సేవల ద్వారా ఆదాయం వచ్చింది. జనవరి 10న హుండీ లెక్కింపులో రూ.1,02,93,399, ఫిబ్రవరి 9న రూ.1,08,62, 138, మార్చి 2న రూ.1,05,05,006 ఆదాయం, బంగారు, వెండి ఆభరణాలు సమకూరాయి. ఈ ఏడాది తొమ్మిది వారాల్లో భాగంగా మెదటివారం రూ.49,83,336, రెండోవారం రూ.38,78,220, మూడోవారం రూ.37,99,740, నాలుగోవారం రూ.48,49,479, ఐదోవారం రూ.58,12,059, ఆరోవారం రూ.66,01753, ఏడోవారం రూ.54,31,001, ఎనిమిదోవారం రూ.77,35,826, తొమ్మిదోవారం రూ.59,19,656 చొప్పున ఆదాయం వచ్చిందని ఆలయ బాధ్యులు తెలిపారు.

అటవీ పరిరక్షణకు కృషి చేయాలి
అటవీశాఖ జిల్లా అధికారి శ్రీనివాస్



విజేతలకు బహుమతి అందజేస్తున్న అటవీశాఖ జిల్లా అధికారి శ్రీనివాస్

కొండపాక(గజ్వేల్): పర్యావరణ పరిరక్షణకు అడవులు దోహదపడుతాయని అటవీశాఖ జిల్లా అధికారి కే.శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మండలంలోని మర్పడ్గ గ్రామ శివారు తేజో వనంలో మంగళవారం వనదర్శిని కార్యక్రమం నిర్వహించారు. బందారం హైస్కూల్ విద్యార్థులకు అడవుల ప్రాముఖ్యతపై ఉపన్యాసం, వ్యాసరచన, వ్యక్తిత్వ పోటీలను నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు అడవులు అవసరమని, హరితహారంలో నాటిన మొక్కలను జాగ్రత్తగా కాపాడుకోవాలని అన్నారు. భవిష్యత్ తరాలకు ఆక్సిజన్ కోసం వృక్ష సంపదను పెంచాల్సిన అవసరాన్ని వివరించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు శ్రావణి, అనిల్‌కు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి లింగమూర్తి, హెచ్ఎం విఠల్, అటవీ సిబ్బంది చంద్రశేఖర్, స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'డబుల్' లక్కీ డ్రాపై దుమారం

- అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో
- ఒంటిపై పెట్రోల్ పోసుకునేందుకు వ్యక్తి యత్నం
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన ఆందోళన



లబ్ధిదారుల ఎంపికకు లక్కీ డ్రా నిర్వహిస్తున్న అధికారులు



ఒంటిపై పెట్రోల్ పోసుకునేందుకు యత్నిస్తున్న వ్యక్తిని వారిస్తున్న దృశ్యం

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో 'డబుల్' ఇళ్ల లక్కీ డ్రా వ్యవహారం దుమారం రేగింది. పట్టణంలోని మహతి ఆడిటోరియంలో నిర్వహించిన లక్కీ డ్రా గందరగోళంగా మారింది. తుది జాబితాలో తమ పేరులేదని, అవకతవకలు జరిగాయంటూ ఆగ్రహించిన దరఖాస్తుదారులు ఆందోళన చేపట్టారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద వేర్వేరుగా ఆందోళన నిర్వహించారు. ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకొనేందుకు యత్నించడంతో ఉద్రిక్తత వాతవరణం చోటుచేసుకుంది.

1,100మంది ఎంపిక

గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, ఆర్‌డీఓ విజయేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ బాల్‌రాజు, ఇన్‌చార్జ్ మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందితో కలిసి మహతి స్టేడియంలో మంగళవారం ఉదయం లక్కీ డ్రా నిర్వహించారు. 1,550మంది పేర్లతో ఉన్న చీటీలను చదివి బాక్సులో వేసి, అందులో నుంచి 1,100 మందిని ఎంపిక చేశారు. డ్రా వచ్చిన వారి చీటీలను మరో బాక్సులో వేసి ఇళ్ల డోర్ నంబర్ చీటీలు, లబ్ధిదారుల ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో జాబితాలో తమ పేర్లు రాలేదంటూ ఆగ్రహించిన కొంత మంది ఆడిటోరియం వద్ద నిరసన తెలిపారు. జాబితాలో అవకతకవలు జరిగాయని ఆరోపిస్తూ అంబేడ్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టగా, గజ్వేల్ సీఐ వీరప్రసాద్ అక్కడకు చేరుకొని ఆందోళనకారులను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లక్కీడ్రాలో పేర్లు రాని 450 మంది సాయంత్రం అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన రహమాన్ ఒంటిపై పెట్రోల్ పోసుకొనేందుకు యత్నించాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, స్థానికులు అతడిని అడ్డుకున్నారు. అనంతరం సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వీరప్రసాద్ తెలిపారు. కాగా లక్కీ డ్రాలో ఎంపికై న 1,100మందికి త్వరలో పట్టాలు పంపిణీ చేస్తామని డీఆర్ఓ విజయేందర్‌రెడ్డి తెలిపారు.

అర్హులకు మరో చాన్స్

గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో డబుల్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన లక్కీడ్రా విజయవంతమైందని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ పేరిట మంగళవారం సాయంత్రం ఓ ప్రకటన వెలువడింది. అర్హత ఉన్న లబ్ధిదారులు ఆర్‌డీఓ కార్యాలయంలో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అందులో సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం
సిద్దిపేటరూరల్: జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో 33 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు (కాంట్రాక్టు పద్ధతిన) అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్ తెలిపారు. ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తులను జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో అందించాలన్నారు. వివరాలకు htt p://siddipet.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

శ్రీకృష్ణవేణి పాఠశాల ప్రిన్సిపాల్ చాంబర్ సీజ్



ప్రిన్సిపాల్ చాంబర్‌ను సీజ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సదాశివపేట(సంగారెడ్డి): మూడేళ్లుగా ఆస్తిపన్ను చెల్లించకపోవడంతో అధికారులు చర్యలు చేపట్టారు. మంగళవారం పట్టణంలోని శ్రీకృష్ణవేణి ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ చాంబర్‌ను సీజ్ చేశారు. మూడేళ్లుగా రూ.6.40 లక్షలు చెల్లించాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినా ఆస్తిపన్ను చెల్లించడంలో నిర్లక్ష్యం వ్యవహరిస్తుండటంతో చర్యలు చేపట్టామని కమిషనర్ ఎస్.కృష్ణారెడ్డి తెలిపారు. పట్టణ ప్రజలు ఆస్తిపన్ను చెల్లించి సహకరించాలనికోరారు.

గల్లంతైన యువకుడి శవం లభ్యం



భార్గవ్(ఫైల్)

నర్సాపూర్ రూరల్: నర్సాపూర్ రాయరావు చెరువులో సోమవారం గల్లంతైన యువకుడి శవం మంగళవారం లభ్యమైంది. గజఈతగాళ్లతో గల్లంతైన భార్గవ్ (22) మృతదేహాన్ని వెలికితీసి నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. హైదరాబాద్ బోర బండకు చెందిన స్నేహితురాలితో కలిసి వచ్చి అర్బన్‌పార్క్ తిలకించి పక్కనే ఉన్న రాయల చెరువులో దిగి గల్లంతైన సంగతి విధితమే.

డ్రంకెన్ డ్రైవ్‌లో పది మందికి జరిమానా

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణంలోని పలు చౌరస్తాల్లో మూడు రోజుల క్రితం పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో పది మంది వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి రూ.23 వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

గంజాయి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు



యాదగిరి

రామాయంపేట(మెదక్): గంజాయితో పట్టుబడ్డ వ్యక్తి నేరం రుజువు కావడంతో కోర్టు జైలు శిక్ష విధించినట్లు ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2017 అక్టోబర్ 27వ తేదీన మండలంలోని కుర్మపల్లి గ్రామానికి చెందిన నాగమల్లు యాదగిరి వద్ద 600 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైంది. అప్పటి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రాధాకిషన్ కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టుచేసి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. మంగళవారం కోర్టులో వాదనల విన్న అనంతరం మెదక్ అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి లక్ష్మీశారద నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ. 50 వేల జరిమానా విధించారు.

దీవించమ్మా.. బట్టమ్మ తల్లి

- కౌడిపల్లి మండలం కూకుట్లపల్లిలో నేడు బట్టమ్మ దేవి జాతర
- ఆలయం లేదు.. అమ్మవారి విగ్రహం లేదు
- నాలుగు వైపులా రాతి స్తంభాలు మధ్యలో చిన్న గోడ
- మట్టి బొద్దులు (గురుగులు) అమ్మవారిగా భావించి పూజలు
- ప్రతీ కుటుంబంలో ఒకరికి బట్టమ్మ, బట్టయ్య పేరు



కూకుట్లపల్లిలో రాతి స్తంభాల మధ్య బట్టమ్మదేవి ఆలయం

కౌడిపల్లి(నర్సాపూర్): వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం. మహిమగల తల్లిగా కొలిచే భక్తులు. కోరిన కోరికలు తీర్చే దేవత అంటూ అమ్మవారి పేరు కుటుంబంలో ఒకరికి పెట్టుకుని భక్తిని చాటుకున్నారు. అయితే అన్ని గ్రామాలలో ఉన్నట్లు అక్కడ ఆలయం లేదు, అమ్మవారి విగ్రహం లేదు. అయినా గ్రామస్తులు భక్తితో కొలుస్తారు. ప్రతీ ఉగాది పండగకు గ్రామస్తులంతా జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించి బండ్లు ఊరేగించి మొక్కులు తీర్చుకుంటారు. ఇది కౌడిపల్లి మండలం కూకుట్లపల్లి గ్రామ శివారులోనిపంట పొలాల్లో వెలిసిన బట్టమ్మదేవి ఆలయం చరిత్ర.

- కౌడిపల్లి మండలం కూకుట్లపల్లి గ్రామ శివారులోని పంట పొలాల్లో బట్టమ్మదేవి ఆలయం ఉంది.
- వందేళ్లకు పైగా ఆలయానికి చరిత్ర కలిగి ఉంది.
- గ్రామానికి చెందిన కరణం వంశస్తులు బట్టమ్మదేవిని వారి వ్యవసాయ భూమిలో ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు.
- ఏటా ఉగాది నాడు జాతర చేస్తున్నారు.
- పటేల్, పట్వారీ, కరణం వ్యవస్థతోపాటు గ్రామ పంచాయతీలు సైతం జాతర జరుపుతున్నారు.

మహిమగల తల్లి బట్టమ్మదేవి

- బట్టమ్మదేవి మహిమగల తల్లి అని గ్రామస్తులు చెబుతారు.
- గ్రామస్తులు కొత్తగా ఏపని చేసిన అమ్మవారికి పూజలు చేస్తారు.
- అమ్మవారి దయతో పంట పొలాలవద్ద ఎలాంటి దొంగతనాలు, దోపిడీలు జరగవని గ్రామస్తులు నమ్మకం.
- అప్పట్లో వరి ధాన్యం దొంగిలించేందుకు వచ్చిన వారుసైతం అక్కడే దొరికిపోయారని పలువురు గుర్తు చేసుకుంటారు.
- అమ్మవారికి మొక్కుకుంటే కోరికలు తీరుతాయని విశ్వాసం

రాతి స్తంభాలే ఆలయం.. మట్టి బొద్దులే అమ్మవారు

- కూకుట్లపల్లిలో వెలసిన బట్టమ్మదేవి ఆలయం రాతి స్తంభాల మధ్యలోనే ఉంది.
- నాలుగు వైపులా రెండు వరుసలలో రాతి స్తంభాలు ఉన్నాయి.
- గతంలో ఏర్పాటు చేసిన ఆలయం ప్రస్తుతం సైతం అలాగే ఉంది.
- రాతి స్తంభాల మధ్యలో చిన్నగోడలో మట్టి బొద్దులు (చిన్న గురుగులు)ను ఏర్పాటు చేసి దేవతలుగా కొలిచి పూజలు చేస్తున్నారు.
- మట్టి బొద్దులను ప్రతీ జాతరకు ఒకసారి కొత్తది ఏర్పాటు చేస్తారు. వాటినే దేవతగా పూజిస్తారు.
- ఆలయాన్ని నిర్మించాలని గ్రామస్తులు అనుకున్నా అమ్మవారు వద్దని చెప్పినట్లు ఆలయ పూజారులు చెప్పారు.
- ఎన్నోఏళ్లుగా గ్రామానికి చెందిన మాదర బోయిన, చెల్ల వంశస్తులు పూజలు చేస్తున్నారు.

గ్రామంలో 40 నుంచి 50 మంది వరకు బట్టమ్మ, బట్టయ్య పేర్లు

- కూకుట్లపల్లి గ్రామంలో వెలిసిన బట్టమ్మదేవి అమ్మవారు కోరిన కోరికలు తీర్చే దైవంగా ప్రజలు భావిస్తున్నారు.
- గ్రామస్తులు అమ్మవారి పేరును భక్తితో తమ సంతానానికి ఆడపిల్లలకు బట్టమ్మ అని, మగపిల్లలకు బట్టయ్య అని పేర్లుపెట్టుకున్నారు.
- ఇలా గ్రామంలో సుమారు 40 నుండి 50 మంది వరకు పేర్లు ఉన్నాయి.
- ప్రతీ కుటుంబంలో ఒకరికి పేర్లు ఉన్నాయి. దీంతో కొన్ని కుటుంబాలలో చిన్న బట్టయ్య, పెద్దబట్టయ్య అని మరికొందరిని ఇంటిపేరుతో సైతం పిలుస్తారు.



ఆలయంలో వెలసిన దేవతామూర్తులు (మట్టి బొద్దులు)

మొక్కు తీర్చుకున్నా

మా తల్లిదండ్రులకు చాలా వరకు సంతానం కలగలేదు. దీంతో పిల్లలు పుడితే నీపేరు పెట్టుకుంటానని మా నానమ్మ బట్టమ్మ తల్లికి మొక్కుకుందంట. దీంతో నేను పుట్టడంతో బట్టయ్య అని పేరుపెట్టారు. అమ్మవారి సన్నిధిలో పుట్టువెంట్రుకలు తీయించి మొక్కులు తీర్చుకున్నారు.

– జంగం బట్టయ్య, రిటైర్డ్ కండక్టర్ కూకుట్లపల్లి

మహిమగల తల్లి

మా గ్రామంలో వెలిసిన బట్టమ్మతల్లి అమ్మవారు మహిమగల తల్లి. గ్రామంలో ప్రతీ ఏడాది ఉగాది పండగకు అమ్మవారికి ఘనంగా జాతర నిర్వహిస్తాం. బండ్లు ఉరేగించి మొక్కులు తీర్చుకుంటాం. పండగను గ్రామస్తులంతా కలిసి ఘనంగా జరుపుకుంటాం. చుట్టుపక్కల గ్రామస్తులు అమ్మవారి ఆలయానికి వచ్చి పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు.

– సుజాత కాంతారావు, సర్పంచ్ కూకుట్లపల్లి

విద్యార్థులను కొరికిన ఎలుకలు



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

- ఇప్పటికి 20 మందికి ఎలుక కాటు
- గుట్టుచప్పుడు కాకుండా వైద్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ గురుకుల పాఠశాల విద్యార్థినిలను ఎలుకలు కొరికిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో ఈనెల 6 నుంచి దాదాపు 20 మంది విద్యార్థినులను ఎలుకలు కొరికినట్లు తెలిసింది. వీరికి గుట్టుచప్పుడు కాకుండా సిద్దిపేట ఏరియా ఆస్పత్రిల్లో చికిత్స చేయించారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగానే ఉందని పాఠశాల సిబ్బంది చెబుతున్నారు. ఎలుకలతో ఇబ్బంది పడుతున్న విషయం విద్యార్థినుల తల్లిదండ్రులకు గురుకుల సిబ్బంది ఎందుకు సమాచారం ఇవ్వడం లేదని మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రిన్సిపాల్‌ని అడిగారు.

చిరుతిళ్లే కారణమా?

ఇది ఇలా ఉండాగా విద్యార్థినుల తల్లిదండ్రులు తినుబండారాలు తీసుకురావడం వాటిని డార్మెటరీలో భద్రపర్చడంతో ఎలుకలు వస్తున్నాయని పాఠశాల సిబ్బంది తెలిపారు.

వైద్యం చేయించాం

పాఠశాలల్లోని డార్మెటరీల్లో ఎలుకలలతో విద్యార్థినులు ఇబ్బందిపడుతున్న మాట వాస్తవామే. వాటిని నివారించేందుకు చర్యలు తీసుకున్నాం. ఇప్పటికే ఎలుకలను పాఠశాలల్లో లేకుండా చేశాం. పాఠశాల చుట్టూ చెట్లు ఉండటంతో కొంచెం ఇబ్బంది ఉంది. గాయపడినవారికి వైద్యం చేయించాం. ప్రస్తుతం వారు ఆరోగ్యంగానే ఉన్నారు. విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– సుప్రియ, ప్రిన్సిపాల్

అధికారులు చొరవ చూపాలి

గురుకుల పాఠశాలల్లో ఎలుకలు కాటువేయడంతో విద్యార్థినిలు ఇబ్బందులు పడ్డుతున్నారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. విద్యార్థినులు అనారోగ్యానికి గురైతే వెంటనే వారికి తల్లిదండ్రులకు సమాచారం అందించాలి. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకూండా అధికారులు, పాఠశాల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– అత్తుమ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు

వ్యక్తి ఆత్మహత్య



కొట్టె కనకయ్య (ఫైల్)

దుబ్బాక: ఆర్థిక ఇబ్బందులు తాళలేక, కుటుంబ పోషణ భారమవడంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన దుబ్బాక పట్టణంలో జరిగింది. దుబ్బాక ఎస్‌ఐ బత్తుల మహేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేటకు చెందిన కొట్టె కనకయ్య (32) గంగిరెద్దులను ఆడిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడికి భార్య దుర్గవ్వ, ముగ్గురు పిల్లలు ఉన్నారు. సంపాదన చాలకపోవడంతోటు కుటుంబ పోషణ భారం కావడంతో తరుచూ భార్యతో గొడవపడేవాడు. సోమవారం రాత్రి ఇంట్లో అందరు నిద్రించిన తర్వాత ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. తెల్లవారు జామున భార్య ఉరి వేసుకున్న భర్తను చూసి చుట్టుపక్కల వారిని పిలిచి వారి సాయంతో దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరిక్షించిన వైద్యులు అప్పటికే కనకయ్య మృతి చెందినట్లు చెప్పారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కష్టపడితే విజయం మీదే

అడిషనల్ డీసీపీ మహేందర్



స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న అడిషనల్ డీసీపీ మహేందర్

సిద్దిపేటజోన్: పట్టుదలతో కష్టపడితే ఉద్యోగం సాధించడం సులువని అడిషినల్ డీసీపీ మహేందర్ అన్నారు. మంగళవారం టీజేఆర్ భవన్‌లో పోలీస్ కానిస్టేబుల్ శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. చివరి మెట్టులో ఉన్నారని, విజయం సాధించే వరకు మీకు తోడు ఉంటామన్నారు. మీరు ఉద్యోగాలు సాధించడమే మాకు మీరు ఇచ్చే బహుమతి అన్నారు. మంత్రి హరీశ్‌రావు, పోలీస్ కమిషనర్ శ్వేత ప్రత్యేకంగా శిక్షణ ఏర్పాట్లు చేయడం జరిగిందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ ఫణీందర్



అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ ఫణీందర్

సిద్దిపేటఅర్బన్: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ రోడ్డు కిరువైపులఏర్పాటు చేసిన సూచిక బోర్డులను గమనిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ట్రాఫిక్ ఏసీపీ ఫణీందర్ అన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ట్రాఫిక్ రూల్స్‌పై ట్రాఫిక్ సీఐ రామకృష్ణతో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ కారణం లేని మరణం ఒక్కరోడ్డు ప్రమాదంలో సంభవించే మరణమే అని అన్నారు. వేగంగా వెళ్లే వాహనానికి, సాధారణ స్పీడ్‌తో వెళ్లే వాహనానికి కేవలం 15 నిమిషాలు మాత్రమే తేడా ఉంటుందన్నారు. వాహనదారులు హెల్మెట్, కారు నడిపే సమయంలో సీటు బెల్టు ధరించాలని సూచించారు. వాహనదారులు, ప్రజలలో మార్పు వచ్చినప్పుడే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని, రోజు రోజుకు వాహనాల రద్దీ పెరుగుతున్న కారణంగా సేఫ్, సెక్యూర్డ్ డ్రైవింగ్ చేయాలని సూచించారు. రాంగ్ రూట్లో ఎట్టి పరిస్థితుల్లో వాహనం నడపవద్దన్నారు. రోడ్డుకు అడ్డదిడ్డంగా వాహనాలు పార్కింగ్ చేయకుండా పార్కింగ్ కోసం నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే పార్క్ చేయాలన్నారు. జరిమానాలు విధించడం తమ అభిమతం కాదని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి మాత్రమే జరిమానాలు విధిస్తున్నట్లు

హుస్నాబాద్‌లో కలపలేదని..

- 'ప్రజాప్రతినిధుల నిర్బంధం
- కార్యాలయం ఎదుట గ్రామస్తుల నిరసన



చౌటపల్లి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, ఉప సర్పంచ్‌ను నిర్బంధించిన దృశ్యం

అక్కన్నపేట(హుస్నాబాద్): చౌటపల్లి గ్రామాన్ని హుస్నాబాద్‌లో విలీనం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సర్పంచ్ గద్దల రమేశ్, ఉప సర్పంచ్ కొత్తకొండ పోశెట్టి, రైతు సమన్వయ కమిటీ కోఆర్డినేటర్ గంగాధరి రాజయ్యను మంగళవారం పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి బయట తాళం వేశారు. అనంతరం కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ తాండ్ర వివేక్ అక్కడకు చేరుకొని కార్యాలయ తలుపులు తీశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ చౌటపల్లి గ్రామం అక్కన్నపేట మండలానికి ఎనిమిది కిలో మీటర్ల దూరంలోఉందని, కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న హుస్నాబాద్‌లో విలీనం చేయాలన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌కు విన్నవించామని, హుస్నాబాద్‌లో కలిపేందుకు ఆయన ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారన్నారు. సోమవారం రాత్రి ప్రభుత్వం విడుదల చేసిన ప్రాథమిక గెజిట్‌లో చౌటపల్లి గ్రామం పేరు లేకపోవడం విచారకరమన్నారు. హుస్నాబాద్‌లో విలీనం చేయకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గంగాధరి శ్రీనివాస్, గ్రామస్తులు చుంచు పరంధాములు, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వసతులు కల్పించడంలో విఫలం

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



భోజనం చేస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సీపూర్‌లోగల మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలను మంగళవారం ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంలో విఫలమైందన్నారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు కింద కూర్చొని భోజనం చేయడం బాధాకరమన్నారు. విద్యార్థులు భోజనం చేయడానికి టేబుల్స్ లేవన్నారు. స్టేడియానికి నిర్మించిన భవనంలోనే గురుకుల పాఠశాల కొనసాగుతుందన్నారు. ప్రత్యేక భవన నిర్మాణం కోసం రూ.10 కోట్లు నిధులు కేటాయించాలని కోరుతూ అసెంబ్లీలో ప్రస్తావించానని ఇంతవరకు స్పందన లేదన్నారు. విద్యార్థుల కోరిక మేరకు ఫ్యాన్లు అందజేశారు. విద్యార్థులతో కలిసి నిద్రచేస్తానని సమస్యలను తెలుసుకుంటానన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

సదాశివపేట(సంగారెడ్డి): పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురికి అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం పట్టణంలోని సిద్దాపూర్ కాలనీలో సేరుగు కిరణ్‌కుమార్ ఇంటిలో సేరిగూడ కిరణ్‌కుమార్, మొగుడంపల్లి వెంకటేశం, మొల్లోల్లా రాజు, ఎన్కతల సాయిరాజ్, మాడపాటి శివకుమార్, బచ్చు పండరి, కుపునగారం కిరణ్‌కుమార్ పేకాట ఆడుతున్నట్లు పోలీసులు తెలిసింది. సంగారెడ్డి డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆదేశాల మేరకు దాడి చేసి ఏడుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,00,500 నగదు, బైక్‌లు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గౌరయపల్లిలో తిరుపతిరెడ్డికి చెందిన మామిడి తోటలో గుట్టు చప్పుడు కాకుండా మూడు రోజులుగా పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు టాస్కఫోర్స్ సిబ్బంది దాడి చేశారు. వారిని కొమురవెల్లి ఎస్‌ఐ చంద్రమోహన్ యాదవ్‌కు అప్పగించారు. మొత్తం 12 మందిని అరెస్టుచేశారు. వారి నుంచి రూ.1,19,000 వేల నగదు, మూడు కార్లు, 1 బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

మహిళల రక్షణకు చర్యలు తీసుకుంటున్నాం

సిద్దిపేట మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ



మాట్లాడుతున్న మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ

సిద్దిపేటకమాన్: మహిళలు, బాలికల రక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు సిద్దిపేట మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ అన్నారు. సిద్దిపేట ఇందిరమ్మ కాలనీ బస్తీ దవాఖానలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య మహిళ కార్యక్రమంలో షీటీం సభ్యులతో కలిసి సీఐ పాల్గొన్నారు. పోక్సో చట్టం, బాల్య వివాహాలు, షీటీమ్ ప్రాముఖ్యత, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీపీ ఆదేశానుసారం మహిళల రక్షణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు గురిచేసినా, మానసికంగా, శారీరకంగా హింసించినా, సోషల్ మీడియాలో ఫొటోలను మార్ఫింగ్ చేసి వేధిస్తుంటే వారి వివరాలను షీటీమ్ పోలీసులకు తెలపాలని సూచించారు. వేధింపులపై డయల్ 100 లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 83339 98699, షీటీమ్ వాట్సాప్ నంబర్ 79016 40473, స్నేహిత మహిళా సపోర్ట్ సెంటర్ 94946 39498కు ఫోన్‌చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో స్నేహిత సెంటర్ కౌన్సిలర్ వసంత, సిద్దిపేట షీటీమ్ సిబ్బంది అనూష, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రఘునందన్‌రావు నోరు అదుపులో పెట్టుకో

బీఆర్ఎస్ నాయకుల మండిపాటు

దుబ్బాకటౌన్: ఎమ్మెల్యే రఘునందన్‌రావు నోరు అదుపులో పెట్టుకోవాలని, లేకుంటే తగిన గుణపాఠం చెబుతామని జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుండెల్లి ఎల్లారెడ్డి,రాష్ట్ర నాయకులు రొట్టె రాజమౌళి, కొత్త కిషన్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం దుబ్బాకలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ పేరిట దుబ్బాకలో దీక్ష చేసిన ఎమ్మెల్యే రఘునందన్ రావు మంత్రి కేటీఆర్‌తో పాటు ప్రభుత్వంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వచ్చే ఎన్నికల్లో డిపాజిట్ కూడ రాదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు అబ్బుల రాజలింగం గౌడ్, బాణాల శ్రీనివాస్, కోమటిరెడ్డి సంజీవరెడ్డి, పండరి రాజాలక్ష్మణ్ రావు తదితరులు ఉన్నారు.

హోటల్ ఫుడ్‌తో పలువురి అస్వస్థత



నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న సీతారాంపూర్ గ్రామానికి చెందిన యువకులు

నర్సాపూర్: ఓ హోటల్‌లో బిర్యాని తినడంతో పలువురు అస్వస్థతకు గురై చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సీతారాంపూర్ గ్రామానికి చెందిన పవన్, అరవింద్, మహేందర్ ఈనెల 18వ తేదీ రాత్రి నర్సాపూర్‌లోని ఓ మండి హోటల్‌లో మండి బిర్యాని పార్శిల్ తీసుకెళ్లి తిన్నారు. అలగే నర్సాపూర్‌కు చెందిన అజీజ్ మరో ఆరుగురు మిత్రులతో కలిసి అదే మండి హోటల్ తిని అస్వస్థతకు గురయ్యారు. ఇదిలాఉండగా నర్సాపూర్‌కు చెందిన మహేశ్, షకీల్, నాని కూడా అస్వస్థతకు గురై వాంతులు, విరేచనాలు కావడంతో మహేశ్ ఆదివారం రాత్రి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. మిగిలిన వారు ఇంటి వద్దనే ఉంటూ చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ మీర్జానజీంబేగ్‌ను అడగ్గా ఫుడ్ పాయిజన్‌తో వారికి వాంతులు విరేచనాలు అయ్యాయని చెప్పారు.

శాంపిల్స్ సేకరణ

నర్సాపూర్‌లోని మన్నత్ అరేబియన్ మండి హోటల్ నుంచి పలు శాఖల అధికారులు శాంపిల్స్ సేకరించినట్లు జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత తెలిపారు. మన్నత్ మండి హోటల్ బిర్యాని తిన్న పలువురు యువకులు అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ సునీత, వైద ఆరోగ్య శాఖ డీఎంహెచ్ఓ డాక్టర్ విజయనిర్మల, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ తదితరులు మంగళవారం హోటల్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ హోటల్‌లో వాడుతున్న పదార్థాలను పరిశీలించడంతో పాటు కొన్ని శాంపిల్స్ సేకరించారు. తాము సేకరించిన శాంపిల్స్‌ను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపుతామని, ఆ నివేదికలు వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. హోటల్‌లో అధికారులు కలియ తిరిగారు.



వంటలో వినియోగించే పదార్థాలను పరిశీలిస్తున్న ఆయా శాఖల అధికారులు